

ఆశ్రమం ఆవరణలో దివ్వెల దీపావళి వెలుగులు



పండుటాకులకు.. పరమపద సోపానమై..

అన్నీ తానై సేవలందిస్తున్న వివేకానంద సంస్థ

నేడు వ్యవస్థాపక దినోత్సవం

పండుటాకులు వారు.. కని.. పెంచి.. విద్యాబుద్ధులు చెప్పిన తమ సంతానం తమను నిర్లక్ష్యం చేస్తే పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థ వారిని అక్కున చేర్చుకుంది. అమ్మలా లాలించి.. నాన్నలా పాలిస్తోంది. ఎటువంటి కష్టం లేకుండా అన్ని వేళలా కంటికి రెప్పలా కాపాడుకొస్తుంది. అయిన వారి కోసం ఎదురు చూస్తున్న ఆ వృద్ధుల కళ్లతో తానూ కళ్లు కలిపి పన్నెండేళ్లుగా ఎదురు చూస్తోంది.

దాబాగార్డెన్స్‌: పాత నగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ 2014 ఫిబ్రవరి 19న ప్రారంభమయింది. పిల్లల ఆదరణకు నోచుకోని వారు.. అందరూ ఉన్నా పట్టించుకోని వారికి భరోసా కల్పిస్తూ సంస్థ ఆవిర్భవించింది. ఎంతో మంది ఈ రోజుల్లో తల్లిదండ్రులను రోడ్డున పడేస్తున్నారు. మాతృదేవోభవ.. పితృదేవోభవ అంటూ కని.. పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత చూపాల్సిన చాలా మంది కర్కోటకంగా ప్రవర్తిస్తున్నారు. అలా కడుపున పుట్టిన వారి ఆదరణకు నోచుకోని అభాగ్యులకు ఆశ్రయం కల్పించాలని ఈ సంస్థ ప్రారంభమైంది. అప్పటి నుంచి వృద్ధుల ఆలనా పాలనా చూసుకుంటూ పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు పేదలకు సేవలందిస్తూ సంస్థ దేదీప్యమానంగా వెలుగొందుతోంది. 14 మంది వృద్ధులతో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి, వారికి ఉచితంగా ఆశ్రయం కల్పించడమే కాక వారి సంరక్షణ బాధ్యతలు సంస్థ చూసుకుంటోంది. ప్రతి నెలా స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యం



సముద్ర తీరాన సేదదీరుతున్న ఆశ్రమవాసులు

లో బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఆశ్రమవాసులకు ప్రతి నెలా వచ్చే పెన్షన్‌తో వారి అవసరాల కోసం కొంత మొత్తాన్ని ఉంచి, మిగతా డబ్బులతో వారికి బంగారు వస్తువులు చేయిస్తున్నారు. అలా చేస్తే వారి అంతిమ యాత్రకైనా పిల్లలు వస్తారని సంస్థ ఆశ. దాతల సహకారంతో ఆధ్యాత్మిక యాత్రలకు తీసుకెళ్తున్నారు. ఇప్పటి వరకు కాశీ, రామేశ్వరం, కన్యాకుమారి, కోల్‌కతా, శ్రీశైలం, మహానంది, గయ, బుద్ధ గయ, అరుణాచలం, తిరుపతి, విజయవాడ తదితర పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్లారు.



సంస్థ ముందు అచ్చటా.. ముచ్చట



డాక్టర్ సేవలు..

వృద్ధుల బాగోగుల కోసం సంస్థ కృషి చేస్తుంటే వారిలో ఎవరైనా అనారోగ్యంతో మంచాన పడితే సంస్థ గౌరవ అధ్యక్షుడు, ఏఎస్‌బీచ్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు.

దహన సంస్కారాలు..

వృద్ధులు ఎవరైనా చనిపోతే వివేకానంద సంస్థ సభ్యులే స్వయంగా దహన సంస్కారాలు నిర్వహించడమే కాక వారి ఆత్మకు శాంతి చేకూరాలని కాశీలో పిండ ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. సంస్థ సభ్యులు సంతోషంగా ఉండడానికి ప్రతి నెలా సినిమాలు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. అధ్యక్షుడు సూరాడ అప్పారావు సంక్రాంతి, ఉగాది తదితర పండగలు ఆశ్రమవాసులతోనే చేసుకోవడం విశేషం.

సేవలు అభినందనీయం..

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఇటీవల ఈ సంస్థను సందర్శించారు. ఆశ్రయం పొందుతున్న పలువురు వృద్ధులతో కాసేపు ముచ్చటించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సొంత తల్లిదండ్రుల వలే చూసుకుంటున్న సంస్థ సభ్యులను అభినందించారు.



వృద్ధులతో ముచ్చటిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

భర్త వర్ధంతిని పురస్కరించుకొని..

సంఘ సేవకుడు పోలిపల్లి అప్పలనాయుడు ఆరో వర్ధంతిని పురస్కరించుకుని అతని భార్య పి. లక్ష్మి, కుమారుడు అవినాష్ స్వామి వివేకానంద సంస్థలో సభ్యులకు అన్నదానం చేశారు. భర్త జ్ఞాపకార్థం సంస్థలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించి వారికి ఎవరూ లేరనే లోటు లేకుండా చూడాలన్నారు.



అన్నదానం చేస్తున్న పోలిపల్లి అప్పలనాయుడు భార్య లక్ష్మి, కుమారుడు అవినాష్

11ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నా..



వృద్ధాశ్రమం ఏర్పాటైన నాటి నుంచి ఇక్కడే ఉంటున్నాను. కొడుకు, కోడలు, మనవరాలు ఉన్నారు కానీ ఎవరూ చూడరు. చూడ్డానికి కూడా రారు. నేనే ప్రతి నెలా వారి వద్దకు వెళ్లి చూసి వస్తుంటాను. సంస్థ చాలా బాగా చూసుకుంటుంది. పెన్షన్ డబ్బులో అవసరాలకు ఉంచుకుని, మిగిలిన డబ్బు బ్యాంకులో ఉంచుతున్నారు. ఆ డబ్బుతో బంగారు గొలుసు, రెండు ఉంగరాలు కొన్నారు. ఆరోగ్యం బాగు లేకపోతే కన్నతండ్రిలా సంస్థ అధ్యక్షుడు అప్పారావు చూసుకుంటున్నారు.

– చిగురుకోట సూర్యనారాయణ, ఆశ్రమవాసి

అనాథల్లా మిగిలిపోకూడదు..



శేష జీవితంలో హాయిగా ఉండాల్సిన వృద్ధులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అందరూ ఉన్నా అనాథల్లా మిగిలిపోకూడదన్న ఉద్దేశంతో సంస్థను ప్రారంభించాం. వీరికి చక్కటి వైద్యసేవలందిస్తూ, పుణ్య, పర్యాటక క్షేత్రాల సందర్శన కల్పిస్తున్నాం. వారికి వచ్చే పెన్షన్ డబ్బుతో వారి అవసరాలకు కొంత మొత్తం పోగా, మిగిలిన డబ్బు వారి పేరిట బ్యాంకులో దాచి బంగారు వస్తువులు చేయిస్తున్నాం. భవిష్యత్‌లో దీన్ని వంద పడకల వృద్ధాశ్రమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం.

– సూరాడ అప్పారావు, సంస్థ అధ్యక్షుడు

చాలా బాగా చూసుకుంటున్నారు



ఏడేళ్లుగా సంస్థలోనే ఉంటున్నాను. నాకు ఎవరూ లేరు. వృద్ధాశ్రమంలో ఉన్న అందరి సంతోషం కోసం పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్తుంటారు. పండగలు, పూజలు సంస్థలోనే బాగా చేసుకుంటున్నాం. పెద్ద కుటుంబంలా ఉంది.

– బొండా కనకమహాలక్ష్మి, ఆశ్రయం పొందుతున్న వృద్ధురాలు



ఆశ్రమవాసి మృతి చెందితే అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



దాబాగార్డెన్స్‌: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు వ్యక్తి



సోదరి చెంత చేరిన తను దరువా

సీతమ్మధార: ఒడిశాలోని బాలంగీర్ దగ్గర మురిబహల్ గ్రామానికి చెందిన తను దరువా (66)కు భార్య మృతి చెందింది. అతనికి కొడుకు, కూతురు ఉన్నారు. మద్యం అతిగా సేవించడం వల్ల అతని మానసిక ఆరోగ్యం దెబ్బ తింది. ఈ నేపథ్యంలో అతను పని కోసం అని చెప్పి ఇంటి నుండి వైజాగ్ వచ్చేశాడు. తాగి పడిపోయి రైల్వేస్టేషన్‌లో బ్యాగు, డబ్బు పోగొట్టుకున్నాడు. అతన్ని గుర్తించిన ఏయూ టీడీ సిబ్బంది తాగుడు మానేయడానికి చికిత్స చేయించారు. నెలరోజుల్లో అతను కోలుకోవడంతో ఒడిశా తీసుకెళ్లి అతని సోదరి శాంతి దరువాకు అప్పగించారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళకు చీర అందజేస్తున్న డాక్టర్ జగదీశ్వరరావు తదితరులు

మహారాణిపేట: బీచ్‌రోడ్డులో ఇటీవల పింక్ సఖీ శారీ వాక్‌లో పాల్గొన్న మహిళా ఆరోగ్య సిబ్బందికి సీఎస్‌ఆర్ నిధుల నుంచి ఇచ్చిన చీరలను మంగళవారం పంపిణీ చేశారు. జగదాంబ జంక్షన్‌లోని బిల్ జంక్షన్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళా ఆరోగ్య సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. టోయోటస్ రేర్ ఎర్త్ ఇండియా ప్రైవేట్ కంపెనీ సీఎస్‌ఆర్ నిధులతో 500 చీరలను మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డాక్టర్ బి.మురళీధరరావు, జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ హారిక, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం పనులు పూర్తి చేయాలని వినతి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం: కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దరి నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం మేయర్‌ను ఆమె ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ నిమిత్తం కల్యాణ మండపం సెల్లార్‌లో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారన్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత వాటిని తొలగించకపోవటంతో వాటిలో ఆకతాయిలు అసాంఘిక కార్యలాపాలకు వినియోగిస్తున్నారని, స్థానికులకు కల్యాణ మండపం అవసరం ఉన్నందున త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు.

ఎమ్మెల్యే వంశీ పరామర్శ

అల్లిపురం: లారీ ప్రమాదంలో గాయపడిన రవికుమార్‌ను కేజీహెచ్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణ పరామర్శించారు. అతని కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. అంతకు ముందు ఘటన జరిగిన ప్రాంతాన్ని తూర్పు ఏసీపీ లక్ష్మణమూర్తి, ట్రాఫిక్ సీఐలతో కలిసి పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

23న ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం

దాబాగార్డెన్స్‌: ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం, ఇండియన్ మ్యాజిక్ అకాడమీ 10వ వార్షికోత్సవం ఈ నెల 23న అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్టు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డి తెలిపారు. ఆ రోజున జూనియర్ పీసీ సర్కార్‌కు స్వర్ణాభిషేకం, ఐఎంఏ జీవన సాఫల్య పురస్కారం అందజేయనున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం బీఎస్ రెడ్డి మాట్లాడుతూ కళాభారతి ఆడిటోరియం వేదికగా..ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి మూడున్నర గంటల పాటు నాన్‌స్టాప్‌గా ఇండియన్ మ్యాజిక్ అవార్డ్స్ నైట్, అధునాతన మహేంద్రజాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత భారతీయ ఇంద్ర జాలికుడు పీసీ సర్కార్ జయంతి అంతర్జాతీయ ఇంద్రజాలికుల దినోత్సవంగా గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఈ ఏడాది పీసీ సర్కార్ తనయుడు జూనియర్ పీసీ సర్కార్‌కు ఐఎంఏ జీన సాఫల్య పురస్కారంతో పాటు మరో 10 మంది దేశ, విదేశీ మెజీషియన్లకు ఐఎంఏ అవార్డులు ప్రదానం చేస్తామని బీఎస్ రెడ్డి తెలిపారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ దేశం, ప్రపంచం నలుమూలల నుంచి ప్రఖ్యాత ఇంద్రజాల నిపుణుల ప్రదర్శనలతో పాటు అవార్డుల ప్రదానోత్సవం విశాఖకే గర్వకారణంగా నిలుస్తుందన్నారు. కళాకారుడు ధనుంజయ్ మాట్లాడుతూ ఉచిత పాస్‌లు ఆశీల్‌మెట్ట రామాటాకీస్ రోడ్డులో గల ధనుంజయ్ అవార్డ్స్ అండ్ గిఫ్ట్స్ షాప్ వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు, మెజీషియన్లు అన్వర్ బాషా, అమర్నాథ్, విజయ్‌కుమార్, ప్రసాద్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్ రెడ్డి, ఇతర ఇంద్ర జాలికులు

వైభవంగా నీలమాంబేశ్వరి అమ్మవారి పరస

అల్లిపురం: అచ్చియ్యమ్మపేటలోని యాతపేటరోడ్డులో వెలసిన నీలమాంబేశ్వరి అమ్మవారి వార్షిక పరస మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు రీసు చంద్రరావు ఆధ్వర్యంలో అమ్మవారికి తెల్లవారు జాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అధ్యక్షుడు రీసు చంద్రరావు, అనిల్‌కుమార్, అప్పారావు, చలపతి ఇతర ఆలయ కమిటీ సభ్యులు భక్తుల దర్శనాలకు తగిన ఏర్పాట్లు చేశారు. యాతపేట, కెప్టెన్ రామారావు జంక్షన్, అచ్చియ్యమ్మపేట, జెండా చెట్టు తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. నీలమాంబేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని కెప్టెన్ రామారావు జంక్షన్ సతకం పట్టు నుంచి గజవాహనంపై తిరువీధి చేపట్టి ఆలయానికి తోడ్కొని వచ్చారు. అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. ప్రధాన పండగ సందర్భంగా సాయంత్రం పరస మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పులివేషాలు, తప్పిటగుళ్లు, నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



విశేష అలంకరణలో నీలమాంబేశ్వరి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకునేందుకు తరలి వస్తున్న భక్తులు

కుంభమేళాకు బయలుదేరిన ఆర్టీసీ సర్వీస్

దాబాగార్డెన్స్‌: ద్వారకా బస్ స్టేషన్ నుంచి కుంభమేళా (ప్రయోగరాజ్)కు మంగళవారం మరో ఆర్టీసీ సర్వీస్ బయలుదేరి వెళ్లింది. జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి బి. అప్పలనాయుడు యాత్ర బస్సును ప్రారంభించి మాట్లాడారు. ఈ యాత్ర ఏడు రోజుల పాటు వివిధ పుణ్యక్షేత్రాలు చూపించి ప్రయోగరాజ్ చేరుకుని అక్కడి నుంచి తిరిగి విశాఖ రానుందని తెలిపారు. యాత్రలో ప్రయోగరాజ్‌తో పాటు అయోధ్య, వారణాసి పుణ్య క్షేత్రాలు దర్శించుకునేలా రాను, పోను 7 రోజుల యాత్ర సాగనుందని తెలిపారు. ప్రయోగరాజ్, కాశీ క్షేత్రాల్లో ఒక రోజు బస ఉంటుందని అప్పలనాయుడు తెలిపారు. ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.8 వేలని, విశాఖ జిల్లా నుంచి ఈ బస్సు ఎవరికైనా కావలిస్తే విశాఖపట్నం డిపో మేనేజర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి. సత్యనారాయణ, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పీటీఎంకే రాజు, విశాఖపట్నం డిపో అసిస్టెంట్ మేనేజర్ పి. ఉజ్వల, అసిస్టెంట్ ఇంజినీర్ రామకృష్ణ, పలువురు సూపర్‌వైజర్లు ద్వారకా బస్‌స్టేషన్లో ఈ బస్సును పర్యవేక్షించారు.



కుంభమేళా బస్సును ప్రారంభిస్తున్న జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి అప్పలనాయుడు

20న మరో బస్సు

ప్రయాణికుల అభ్యర్థన మేరకు మరో బస్సు ఈ నెల 20న సాయంత్రం 6 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరుతుందని, టికెట్ ధర రూ.8 వేలుగా నిర్ణయించామని అప్పలనాయుడు తెలిపారు. టికెట్లు కావల్సిన వారు ఆన్‌లైన్‌లో గాని, సమీప బస్‌స్టేషన్‌లో గాని సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 7095605769, 8978200455 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

జనగణనతో పాటే కులగణన కూడా జరపాలి

దాబాగార్డెన్స్‌: జాతీయ స్థాయిలో నిర్వహించే జనగణనతో పాటే కుల గణన కూడా జరపాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వీఏ రాజుగౌడ్ డిమాండ్ చేశారు. జడ్జి కోర్టు సమీపాన మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. జాతీయ స్థాయిలో నిర్వహించనున్న జనగణనతో పాటే కులగణన తప్పకుండా చేయాలన్నారు. కుల గణన చేయాల్సిన ప్రాధాన్యత గురించి కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కల్గించాలన్నారు. స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు సరైన రిజర్వేషన్లు కేటాయించాలన్నా, జస్టిస్ రోహిణి కమిషన్ సిఫారసుల మేరకు ఓబీసీల వర్గీకరణ జరపాలన్నా ఈ సారి నిర్వహించే జన గణనతో పాటే కులగణన చేపట్టాలన్నారు. కేంద్రంలో ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి, ఓబీసీ సబ్ ప్లాన్ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి, ప్రత్యేక రాయితీలతో పథకాలు అమలు చేయాలన్నారు. సయ్యద్ ముస్తఫా, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు చట్టాలు దోహదం

దాబాగార్డెన్స్‌: మహిళల ఆత్మరక్షణకు ఎన్నో మార్గాలున్నాయని మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీ సీహెచ్ పెంటారావు అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా చట్టాల కోసం తెలుసుకోవాలని, ప్రేమ వ్యామోహంలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగాల్లో స్థిరపడితే మంచి వరుడు వస్తాడని, సోషల్ మీడియా ద్వారా అపరిచిత వ్యక్తులను నమ్మి, వారితో ప్రేమ వ్యవహారాల్లో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. రిటైర్డ్ జడ్జి పైలా సన్నిబాబు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదివిస్తారని, వారి ఆశలు వమ్ము చేయొద్దని, తల్లిదండ్రులను ప్రేమించి, వారి అడుగు జాడల్లో ఉన్నత చదువులు చదివి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో సందీప్, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కడారి కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ భీశెట్టి వెంకటేశ్వరరావు, హిమా హ్యూమానిటేరియన్ సంస్థ వ్యవస్థాపకుడు టీవీడీ దాస్, బండారు రామారావు, టి. రాజేశ్వరి, రమ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ పెంటారావు

కీటకజనిత వ్యాధుల పట్ల అప్రమత్తం

మహారాణిపేట: దోమల వల్ల సంక్రమించే మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతి ప్రభ అన్నారు. మంగళవారం జగదాంబ వద్ద గల బిల్ జంక్షన్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ వ్యాధులు దోమల వల్ల వస్తాయని, దోమల నివారణకు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసి మాట్లాడుతూ దోమల వల్ల వచ్చే వ్యాధులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులకు ఎన్.వి.బి.డి.సి.పి. ప్రోగ్రాం (నేషనల్ వెక్టార్ బోర్న్ డిసీస్ కంట్రోల్ ప్రోగ్రాం) కింద మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ వంటి కీటక జనిత వ్యాధులపై పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, వైద్య ఆరోగ్యశాఖ నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, వివిధ విభాగాల అధికారులు బి.రమేష్, డాక్టర్ లూసీ, ఐ.మనోరమ, తులసి, మురళీకృష్ణ, శశిభూషణ్, రమేష్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మలేరియా జోనల్ అధికారి డాక్టర్ శాంతిప్రభ. చిత్రంలో డాక్టర్ జగదీశ్వరరావు

నిరుపయోగంగా పేపర్ ప్లేట్ల విక్రయ కేంద్రం



పూర్ణామార్కెట్ వద్ద నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల విక్రయ కేంద్రం

జగదాంబ: పూర్ణామార్కెట్ వద్ద ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జీవీఎంసీ ఏర్పాటు చేసిన తక్కువ మైక్రాన్లు ఉండే ప్లాస్టిక్, అరటి, జ్యూట్, పేపర్‌ప్లేట్స్ వంటివి విక్రయించే కేంద్రం అధికారుల పర్యవేక్షణ లేమి కారణంగా మూడునాళ్ల ముచ్చటగా మారింది. ఈ కేంద్రాన్ని కొన్నాళ్లు మాత్రం నిర్వహించారు. తర్వాత దీని గురించి పట్టించుకోకపోవడంతో ఇది నిరుపయోగంగా పడి ఉంది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ కేంద్రాన్ని తిరిగి తెరిపించాలని పలువురు కోరుతున్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

జగదాంబ: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు అమ్మినా, వినియోగించినా చర్యలు తప్పవని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు హెచ్చరించారు. మంగళవారం ఆయన జోన్ పరిధిలోని సెంట్రల్ పార్కు, రామకృష్ణా రైతుబజార్ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగానికి సంబంధించి చిరు వ్యాపారుల దుకాణాలను పరిశీలించారు. వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు కొనడం గానీ, అమ్మడం చేయరాదన్నారు. వినియోగదారులు ఇంటి నుంచే జ్యూట్‌బ్యాగ్‌లు, గుడ్డసంచులు తీసుకు రావాలని చెప్పాలన్నారు. మొదట్లో ఇబ్బందిగా అనిపించాని తర్వాత అలవాటు అవుతుందన్నారు. తద్వారా ప్లాస్టిక్ వినియోగం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు